సాక్షి
రంగారెడ్డి
శనివారం । 4 । ఫిబ్రవరి । 2023

నగరానికి చేరుకున్న ఈ- రేసింగ్ ఎస్కార్ట్ వాహనాలు

శంశాబాద్: ఈ-రేసింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎస్కార్ట్‌గా వినియోగించే కార్లు నగరానికి చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం రియాద్ నుంచి కార్గో విమానంలో వచ్చిన ఐదు ఎస్కార్ట్, రెన్యూ కార్లను శంషాబాద్ జీఎంఆర్ కార్గో టెర్మినల్‌లో ప్రత్యేక కార్గో హ్యాండ్లింగ్ యంత్రాల ద్వారా ప్రక్రియ పూర్తి చేశారు. అనంతరం కస్టమ్స్ ప్రక్రియను పూర్తి చేసి ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపించారు.

హస్త కళాకృతుల ప్రదర్శన

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లోని లేపాక్షి హస్తకళల ఎంపోరియంలో హస్తకళాకృతుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. శుక్రవారం ప్రారంభమైన ఈ ప్రదర్శన ఈ నెల 12 వరకు కొనసాగుతుంది. హస్తకళలను సంరక్షించడం, అభివృద్ధిపర్చడం, సరైన మార్కెటింగ్ సౌకర్యాలు పెంచి వాటి ఉన్నతికి, హస్త కళాకారుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు.

మంత్రిని కలిసిన కలెక్టర్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరీశ్ శుక్రవారం జిల్లా మంత్రి సబితారెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేకంగా చొరవ చూపించాలని పేర్కొన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

న్యూస్‌రీల్

ఎస్సీ కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రవీణ్

చేవెళ్ల: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ ఈడీ ప్రవీణ్ అన్నారు. డివిజన్‌లోని నాలుగు మండలాల లబ్ధిదారులకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ద్వారా వివిధ రకాల రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. చేవెళ్లలో 17, శంకర్‌పల్లి 20, షాబాద్ 27, మొయినాబాద్‌లో 21 యూనిట్లకు రుణాలు మంజూరైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ కాశమయ్య, బ్యాంకు మేనేజర్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్స్‌కోసం దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (నాగర్‌కర్నూల్)లో బోధించేందుకు గెస్ట్ లెక్చరర్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. కళాశాలలో ఫిజిక్స్, బోటనీ సబ్జెక్టులను బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ అర్హత కలిగి ఉండాలని, రూ.25వేల వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 7వ తేదీలోపు కళాశాలలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూ, డెమోలను నూర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

రూ.500 కోట్ల పంట రుణాలు

డీసీసీబీ చైర్మన్ నిజాంపాషా



డీసీసీబీ చైర్మన్ నిజాంపాషాను సత్కరిస్తున్న గంప వెంకటేశ్ తదితరులు

ఆమనగల్లు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ ద్వారా ఈ ఏడాది రూ.500 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్యాల నిజాంపాషా వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటివరకు రూ.360 కోట్ల పంట రుణాలు అందించినట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయం రికార్డులను పరిశీలించారు. సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం నిజాం పాషా మాట్లాడుతూ.. రైతులకు పంటసాగు చేయడానికి ఇబ్బందులు లేకుండా రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా టెస్కాబ్ నిబంధనలను అనుసరించి రూ.60 వేల నుంచి రూ.3 లక్షల వరకు పంట రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా ఇప్పటివరకు రూ.30 కోట్ల రుణాలు రికవరీ చేసినట్లు వివరించారు. ప్రతి పీఏసీఎస్ పరిధిలో నాబార్డ్ నిధుల నుంచి గోదాము నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు రూ.90 కోట్లతో 45 గోదాములు నిర్మించినట్లు ఆయన చెప్పారు. డీసీసీబీ ద్వారా విద్యార్థుల విదేశీవిద్యకు రూ.25 లక్షలు, స్వదేశీ విద్యకు రూ.10 లక్షల వరకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి రుణాలు ఇవ్వడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. గతంలో నష్టాల్లో ఉన్న డీసీసీబీ రెండేళ్లుగా లాబాల బాటలో ఉందన్నారు. అనంతరం నిజంపాషాను సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్, మార్కెట్‌చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు పత్యానాయక్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు దోనాదుల కుమార్, స్థానిక నాయకులు రమేశ్‌నాయక్, పీఏసీఎస్ సీఈఓ దేవేందర్, సిబ్బంది పద్మాకర్‌రెడ్డి, అల్లాజీ, మహేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన చదువులు!

సమీపిస్తున్న వార్షిక పరీక్షలు

- ఇప్పటికీ పూర్తికాని పాఠ్యాంశాలు
- ఇటు పదోన్నతులు, బదిలీలు
- అటు ఎమ్మెల్సీ ఎన్నికలు
- బిజీబిజీగా ఉపాధ్యాయులు
- ఆందోళనలో తల్లిదండ్రులు



అంతటా అదే చర్చ..

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మరికొద్ది రోజుల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికీ మెజార్టీ ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యాంశాలు పూర్తి కాలేదు. పునశ్చరణ తరగతులు ఇంకా మొదలు కాలేదు. పరీక్షలపై విద్యార్థుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు వారిలో మానసిక స్థైర్యం పెంపొందించాల్సి ఉంది. కీలకమైన వార్షిక పరీక్షల సమయంలో ఇటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, అటు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టడంతో పాఠ్యాంశాలపై ప్రభావం పడుతోంది. డిసెంబర్ చివరి నాటికే పాఠ్యాంశాలు పూర్తి చేసుకుని, పునశ్చరణ ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంది. వరుస కోవిడ్ సెలవులకు తోడు పాఠ్యపుస్తకాల ముద్రణలో చోటు చేసుకున్న జాప్యం కారణంగా మెజార్టీ పాఠశాలల్లో సకాలంలో పాఠ్యాంశాలు ప్రారంభం కా లేదు. ప్రత్యేక తరగతులే కాదు పరీక్షలు సైతం నిర్వహించలేదు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిలో నైపుణ్యాన్ని పెంపొందించే కసరత్తు చేయాల్సిన సమయంలో కొంతమంది ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు పొందే అంశంలో బిజీగా ఉండగా మరికొంత మంది ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మునిగిపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

జిల్లాలో 2,863 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండగా, వీటిలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 6,84,037 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో సుమారు లక్ష మంది పదో తరగతి విద్యార్థులున్నట్లు అంచనా. ప్రస్తుతం ప్రాక్టీస్ టెస్ట్-1 పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నెల 22 నుంచి 28 వరకు ప్రీఫైనల్ ఎగ్జామ్స్ కొనసాగనున్నాయి. ఏప్రిల్‌లో వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇప్పటికే ఎస్‌ఎస్‌సీ బోర్డు ప్రకటించింది. మరోవైపు ఉపాధ్యాయుల బదిలీలు, ఆన్‌లైన్ కౌన్సెలింగ్, పదోన్నతుల షెడ్యూల్ సైతం విడుదల చేసింది. పాఠశాలలు, సబ్జెక్టుల వారీగా ఏర్పడిన ఖాళీలు, హెచ్‌ఆర్‌ఏ పోస్టులు, పదోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులు, బదిలీల్లో భాగంగా ఎంపిక చేసుకునే పాఠశాలలు, రవాణా సదుపాయాల అంశాలపైనే ప్రధానంగా చర్చ సాగుతోంది.వీటికి అవకాశం లేని వారు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, ప్రచార సరళిపై దృష్టిసారించి, రోజుకో మండల పరిధిలోని పాఠశాలల్లో ప్రచారం నిర్వహిస్తుండటం గమనార్హం. సెలవు రోజులు, ఇతర ఖాళీ సమయాల్లోనే కాదు.. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాల్సిన సమయంలోనూ ఇదే చర్చించుకుంటున్నారు. ఎప్పటికప్పుడు ఆయా పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి విద్యార్థుల అభ్యసన శక్తిని పరీక్షించాల్సిన మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు సైతం ఇతర పనుల్లో నిమగ్నం కావడం ఆందోళన కలిగిస్తోంది.

తల్లిదండ్రుల్లో గుబులు

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గం పరిధిలో 33,116 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్లు అంచనా. వీరిలో ఇప్పటి వరకు 29 వేల మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. పీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఎస్టీయూ సహా ఇతర ఉపాధ్యాయ సంఘాల నుం చి సీనియర్ లీడర్లు బరిలోకి దిగారు. ఎలాగైనా శాసన మండలిలో అడుగు పెట్టాలని భావిస్తున్నారు. ఎన్నికల కమిషన్ త్వరలోనే నోటిఫికేషన్ వెల్లడించే అవకాశం ఉంది. ఎలాగైనా తమ సంఘం నేతను ఎన్నికల్లో గెలిపించి శాసనమండలికి పంపాలని ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతలు స్థానిక పాఠశాలల్లో పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. రోజుకు కనీసం ఐదారు పాఠశాలలకు తగ్గకుండా చుట్టేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి సారించాల్సిన ఉపాధ్యాయులు ఎన్నికలు, బదిలీలు, పదోన్నతులే లక్ష్యంగా పని చేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలకు సెలవు పెట్టి ఎన్నికలే ప్రధానంగా పని చేస్తుంటే.. మరి కొంత మంది ఫంక్షన్లు, ఇతర పనుల పేరుతో గైర్హాజరవుతున్నారు. ప్రభుత్వం వార్షిక పరీక్షల సమయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, బదిలీల ప్రక్రియకు శ్రీకారం చుట్టడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సంగీత విద్వాంసురాలు సుధా రఘునాథన్‌కు బహుమతిని అందిస్తున్న గురూజీ కమ్లేష్ పటేల్

ధ్యానంతో ఒత్తిడి దూరం

నందిగామ: నిరంతర ధ్యానంతో తనను తాను తెలుసుకోవడంతో పాటు మానసిక ఒత్తిడిని జయించవచ్చని శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్ అన్నారు. కాన్హా శాంతి వనంలోని శ్రీ రామచంద్ర మిషన్‌లో పది రోజులుగా కొనసాగుతున్న లాలాజీ మహరాజ్ 150వ జయంతి వేడుకలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ధ్యాన శిబిరంలో గురూజీ కమ్లేష్ పటేల్ మాట్లాడుతూ.. లాలాజీ సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఆత్మను శుద్ధి చేసుకునేందుకు ధ్యానం చేయడం నిత్య జీవితంలో అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఆకు పచ్చని కాన్హా శాంతి వనంలో దేశ విదేశాలకు చెందిన అభ్యాసీలతో పది రోజులుగా వేడుకలను సగర్వంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసురాలు సుధా రఘునాథన్ స్వర పఠనం పలువురి అభ్యాసీలను విశేషంగా అలరించింది.

పాలు బలవర్ధకమైన ఆహారం

- హోంమంత్రి మహమూద్ అలీ

మాదాపూర్: పాలు బలవర్ధకమైన ఆహారమని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం డైరీ, ఫుడ్ ఎక్స్‌పోలను ప్రారంభించారు. పాడి, ఆహార పరిశ్రమలకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ సోమభరత్‌కుమార్ మాట్లాడుతూ.. ఒకప్పుడు మూతపడుతుందని ఊహించిన విజయ డెయిరీ బాగా పని చేస్తోందన్నారు. రూ.700 కోట్ల టర్నోవర్ సాధించి రూ.1000 కోట్ల లక్ష్యంతో ఉందన్నారు. ఎక్స్‌పోలో 105 మంది ఎగ్జిబిటర్లు పాల్గొన్నట్టు తెలిపారు. ఎగ్జిబిషన్‌ను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు రెండు ఎక్స్‌పోల నిర్వాహకుడు ముదస్సిర్ అహ్మద్ చెప్పారు. ఉత్తమ సేవలు, యంత్రాలు, పరికరాలు, సాంకేతికత, ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి


పన్నులు తగ్గించే వరకు పోరాటం

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్: పెరిగిన ఇంటి ట్యాక్సులు తగ్గించాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే ఇంటి ట్యాక్సులు తగ్గిస్తానని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన మంత్రి సబితారెడ్డి వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. నాలుగేళ్లలో మీర్‌పేట్, బడంగ్‌పేట కార్పొరేషన్లు, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీల అధికారులతో సమీక్ష సమావేశాలు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. పాత పర్మిషన్లతో ఇళ్లను నిర్మించుకుంటే ట్యాక్సుల పేరుతో ప్రజల నెత్తిన మోయలేని భారం మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదికి ఇంటి ట్యాక్సులే రూ.వేలు, రూ.లక్షల్లో వస్తే సామాన్య మధ్యతరగతి ప్రజలు ఎలా బతకాలని నిలదీశారు. జీహెచ్‌ఎంసీలో 120 గజాల్లో ఇళ్లు నిర్మించుకుంటే ఎలాంటి ట్యాక్సులు లేవు కానీ ఇక్కడ మాత్రం సామాన్యుడు కట్టలేని రీతిలో ట్యాక్సులు వేయడం ఏమిటని మండిపడ్డారు. ట్యాక్సులు తగ్గించేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగురింత పారిజాత మాట్లాడుతూ.. బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధికి నోచుకోవడం లేదనే పార్టీ మారినట్టు స్పష్టం చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్దబావి వెంకట్‌రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రికార్డుస్థాయిలో మిర్చి ధర

- మలక్‌పేట్ మార్కెట్‌లో క్వింటాల్ రూ.21,000
- గతేడాది ఇదే సీజన్‌లో రూ.14,000
- దిగుమతులు తగ్గడంతోనే డిమాండ్ ఎక్కువ



సాక్షి, సిటీబ్యూరో: నగర మార్కెట్లకు ఎండు మిర్చి అనుకున్న స్థాయిలో దిగుమతులు లేకపోవడంతో ధర ఎక్కువ పలుకుతోంది. ఈ సీజన్‌లో మిర్చి ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.18 వేల నుంచి రూ.21 వేల వరకు ధరలు నమోదయినట్లు మార్కెట్ అధికారులు చెప్పారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం నుంచే కాకుండా ఏపీలోని గుంటూరు, కర్నూలు నుంచి కూడా పెద్దగా మిర్చి హైదరాబాద్‌కు దిగుమతి కావడం లేదని హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు. గత సంవత్సరం క్వింటాల్ మిర్చి ధర అత్యధికంగా రూ. 14 వేలు పలకగా ఈసారి మాత్రం రికార్డు స్థాయిలో క్వింటాల్‌కు రూ.18 వేల నుంచి రూ. 20 వేల వరకు పలుకుతోంది. మిర్చిలో అత్యంత నాణ్యమైనదిగా భావించే తేజా రికార్డు స్థాయిలో ధర పలుకుతున్నట్లు హోల్‌సేల్ మిర్చి వ్యాపారులు తెలిపారు.

రోజు మార్కెట్‌కు 20 వేల క్వింటాళ్లు

సాధారణంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో మార్కెట్‌కు వచ్చే మిర్చి ఉత్పత్తులు గతేడాదితో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. గతేడాది డిసెంబర్ నుంచే మార్కెట్‌ను ముంచెత్తుతోంది. కానీ ఈ ఏడాది ఫిబ్రవరి నెల ప్రాంభమైనా ఇంకా దిగుమతులు ఊపందుకోలేదని వ్యాపారులు పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రధాన హోల్‌సేల్ మార్కెట్లు మలక్‌పేట, ఉస్మాన్‌గంజ్, బోయిన్‌పల్లితో పాటు ఇతర చిన్న మార్కెట్లకు నిత్యం 40 నుంచి 60 లారీల సరుకు వస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఇది మరింత పెరగే అవకాశం ఉందని అంటున్నారు. గత సంవత్సరం కంటే ఈసారి మిర్చి ఉత్పత్తి బాగా తగ్గిదంటున్నారు. కాగా.. సాధారణంగా ఉత్పత్తి బాగా పెరిగితే ధర పడిపోతుంది. దిగుమతి తగ్గడంతో ధరలు ఎక్కువగానే ఉంటాయి. అయితే కొందరు వ్యాపారులు మాత్రం మిర్చిని అక్రమంగా నిల్వ చేసుకుని కృత్రిమ కొరత సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం ముందస్తుగా ఇలాంటి వారిపై చర్యలు తీసుకోకపోతే ఉల్లి మాదిరిగానే మిర్చి ధరలూ పెరిగిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

సాగులో ఆధునిక సాంకేతికత మేలు

చేవెళ్ల: వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత పెరగాలని రిటైర్డ్ ఐఏఎస్ రాంపుల్లారెడ్డి, సీడ్ వర్క్స్ ఇంటర్నేషనల్ సీఈఓ డాక్టర్ వెంకట్‌రామ్ అన్నారు. ఊరెళ్ల సమీపంలోని సాగర్ విద్యాసంస్థల్లో శుక్రవారం వ్యవసాయ వ్యాపారం- ఆధునిక పద్ధతులు అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. దేశవ్యాప్తంగా పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొని వ్యవసాయ రంగంతోపాటు వ్యవసా య ఆధారిత వాణిజ్య రంగంలో వస్తున్న మార్పులు, సాంకేతికత వాడకం, విలువల ఆధారిత పరిశ్రమలపై చర్చించారు. దేశంలో కరోనా తరువాత వ్యవసాయ రంగంలో పెను మార్పులు వచ్చినట్లు తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంపై మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కూలీల వినియోగం తగ్గించి యంత్ర పరికరాల వాడకం పెరగాల్సి ఉందన్నారు. వ్యవసాయంలో డ్రోన్‌ల ఉపయోగం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించి వ్యవసాయాన్ని లాభాల బాటలో నడిపించాల్సి ఉందన్నారు. వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు తమ అధ్యయనాలను వివరించారు. ఉత్తమ అధ్యయనాలను గుర్తించి బహుతులు అందజేశారు. కార్యక్రమంలో సాగర్ విద్యాసంస్థల కార్యదర్శి మాలతి, డైరెక్టర్ డాక్టర్ సురేశ్, డీన్ సాహు, నిర్వాహకులు డాక్టర్ రామ్‌నరేశ్, మహిపాల్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులు

లేట్టైనా లేటెస్ట్‌గా!

అమరవీరుల స్మారకం మరింత ఆలస్యం

- ఈ నెల 17న ప్రారంభం అనుమానమే
- త్వరితగతిన కొనసాగుతున్న పనులు
- ఈ నెలాఖరు వరకు పూర్తయ్యే అవకాశం
- ప్రపంచంలోనే అరుదైన పర్యాటక కేంద్రం
- అమరుల గ్యాలరీ, వీడియో, ఆడియో సెంటర్
- విశాలమైన సమావేశ మందిరం, రెస్టారెంట్ వసతులు



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తెలంగాణ అమరవీరుల స్మారకం ఆలస్యమయ్యే అవకాశం ఉంది. వేగంగా పనులు కొనసాగుతున్నప్పటికీ ఈ నెల 17వ తేదీన సచివాలయంతో పాటు ఈ చారిత్రక కట్టడాన్ని కూడా ప్రారంభించడం సాధ్యం కాకపోవచ్చు. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి, రెండు అంతస్తుల భవనాలు పూర్తయ్యాయి. కానీ ఫ్లోరింగ్ పనులతో పాటు తుది మెరుగుల దిద్దాల్సిన కార్యక్రమాలు చాలా ఉన్నాయి. అలాగే పైన స్టెయిన్‌లెస్ స్టీల్ నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఆవరణలో రెండు వైపులా ల్యాండ్‌స్కేప్ పనులు చేపట్టారు. ఫౌంటెన్ నిర్మాణం పూర్తయింది. కానీ చుట్టూ గ్రిల్స్ వంటి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అలాగే గ్రౌండ్‌ఫ్లోర్‌లో అమరవీరుల చిత్రపటాలు, స్మారకాలతో మ్యూజియం ఏర్పాటు చేయాలి. మరోవైపు రూ.179 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రపంచంలోనే అరుదైన చారిత్రక కట్టడం తెలంగాణ అమరవీరుల స్మారకం పనులు ఇప్పటి వరకు 90 శాతం పూర్తయ్యాయని ఆర్కిటెక్ట్ ఎంపీ రమణారెడ్డి తెలిపారు. సాధ్యమైనంత వరకు పనులు సకాలంలో పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఉన్న అంచనాల ప్రకారం ఈ నెల 17న కాకుండా ఈ నెలాఖరు వరకు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు కనిస్తోంది.

ఇదీ భవన నిర్మాణం..

సుమారు 3.2 ఎకరాల విస్తీర్ణంలో హుస్సేన్‌సాగర్ తీరాన లుంబిని పార్కును ఆనుకొని చేపట్టిన తెలంగాణ అమరవీరుల స్మారకాన్ని ఎలాంటి అతుకులు లేని స్టెయిన్‌లెస్ స్టీల్‌తో నిర్మిస్తున్నారు. సాధారణంగా పాలు, వంటనూనెలు సరఫరా చేసే ట్యాంకర్ల కోసం 304 స్టెయిన్‌లెస్ స్టీల్‌ను వినియోగిస్తారు. కానీ.. దీని కోసం 316ఎల్ స్టీల్‌ను వినియోగించారు. దుబాయ్‌లోని ఫ్యూచర్ మ్యూజియానికి వినియోగించిన స్టీల్‌కు అతుకులు ఉన్నాయి. కానీ.. ఈ స్మారకానికి ఎలాంటి అతుకులు లేకపోవడమే ప్రత్యేకత. 85000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. ప్రతి ఫ్లోర్‌కు ఒక ప్రత్యేకత ఉంటుంది. సందర్శకులు దియా (జ్యోతి) వరకు వెళ్లగలుగుతారు. అక్కడ ఉండే విశాలమైన ప్రాంతంలో ఒకవైపున రెస్టారెంట్ ఉంటుంది.

త్యాగాలను ఎత్తిపట్టేలా..

తెలంగాణ అమరవీరుల త్యాగాలను, వీరోచిత పోరాట గాథలను స్మరించుకొనేలా గ్రౌండ్‌ఫ్లోర్‌లో చిత్రపటాలు, చారిత్రక చిహ్నాలు ఉంటాయి. ప్రేక్షకులు వీక్షించేందుకు లేదా విని తెలుసుకొనేందుకు ఆడియో, వీడియో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ ఘట్టాలను తెలుసుకోవచ్చు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో వివిధ ప్రాంతాలకు చెందిన అమరవీరులు సాగించిన పోరాటల తీరుతెన్నులు తెలుసుకొనే అకాశం ఉంటుంది. మ్యూజియంలోనే అక్కడక్కడా కియోస్కులు, టచ్‌స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తారు. వీటి ద్వారా కూడా తెలంగాణ ఉద్యమ చరిత్ర విశేషాలను తెలుసుకొనే అవకాశం ఉంటుంది.

సాహిత్య సదస్సులు, కళాప్రదర్శనలు..

పై అంతస్తులో 600 మంది కూర్చునేందుకు అనువైన కన్వెన్షన్ హాల్ ఉంటుంది. రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సులు, సాహిత్య సదస్సులు, కవి సమ్మేళనాలు, అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇది ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఈ హాల్‌లో ఏర్పాటు చేసే కుర్చీలను సభాకార్యక్రమాలకు అనుగుణంగా మార్చుకోవచ్చు. అలాగే ఆర్ట్ గ్యాలరీలు వంటివి కూడా ఈ హాల్‌లో ఏర్పాటు చేయవచ్చు.

టెర్రస్ పై 'దియా'..

టెర్రస్‌పైన అమరవీరులకు నివాళులర్పిస్తున్న స్ఫూర్తిని కలిగించే వెలిగే ఆకృతిలో దియా (జ్యోతి) ఉంటుంది. మరొకవైపు రెస్టారెంట్ ఉంటుంది. ఈ రెస్టారెంట్‌లో వంటగ్యాస్ వినియోగించేందుకు అనుమ తి ఉండదు. కేవలం ఎలక్ట్రిక్ పొయ్యిలను మాత్ర మే వినియోగించాలి.టీ,కాఫీ, స్నాక్స్ వంటివి మాత్ర మే అందుబాటులో ఉంటాయి. టెర్రస్‌పై కూర్చుంటే 180 డిగ్రీల కోణంలో చుట్టూ ఉన్న పరిసరాలను వీక్షించవచ్చు. సెక్రటేరియట్, అంబేడ్కర్ విగ్రహం, ఐమాక్స్, బిర్లా మందిర్ స్పష్టంగా కనిపిస్తాయి.

ఇవీ సదుపాయాలు..

- సందర్శకులు అత్యవసర పరిస్థితుల్లో పై నుంచి నేరుగా కిందకు చేరుకొనేందుకు రెండు వైపులా మెట్లు ఏర్పాటు చేశారు.
- రెండు లిఫ్టులు, ఎస్కలేటర్లు అందుబాటులో ఉంటాయి. అన్ని ఫ్లోర్‌లలో వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు.
- భవనానికి ప్రధాన ద్వారంతో పాటు మరో నాలుగు చోట్ల చిన్న చిన్న నిష్క్రమణ ద్వారాలను ఏర్పాటు చేశారు.
- ప్రాంగణంలో పచ్చదనం ఉట్టిపడే ల్యాండ్‌స్కేప్‌లు, వాటర్ ఫౌంటెన్‌లు, తెలంగాణ తల్లి విగ్రహం ప్రత్యేకంగా ఆకట్టుకోనున్నాయి. సందర్శకులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకొనేందుకు విశాలమైన ఆవరణ ఉంది.

ఇదీ భవన నిర్మాణం..

సుమారు 3.2 ఎకరాల విస్తీర్ణంలో హుస్సేన్‌సాగర్ తీరాన లుంబిని పార్కును ఆనుకొని చేపట్టిన తెలంగాణ అమరవీరుల స్మారకాన్ని ఎలాంటి అతుకులు లేని స్టెయిన్‌లెస్ స్టీల్‌తో నిర్మిస్తున్నారు. సాధారణంగా పాలు, వంటనూనెలు సరఫరా చేసే ట్యాంకర్ల కోసం 304 స్టెయిన్‌లెస్ స్టీల్‌ను వినియోగిస్తారు. కానీ.. దీని కోసం 316ఎల్ స్టీల్‌ను వినియోగించారు. దుబాయ్‌లోని ఫ్యూచర్ మ్యూజియానికి వినియోగించిన స్టీల్‌కు అతుకులు ఉన్నాయి. కానీ.. ఈ స్మారకానికి ఎలాంటి అతుకులు లేకపోవడమే ప్రత్యేకత. 85000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. ప్రతి ఫ్లోర్‌కు ఒక ప్రత్యేకత ఉంటుంది. సందర్శకులు దియా (జ్యోతి) వరకు వెళ్లగలుగుతారు. అక్కడ ఉండే విశాలమైన ప్రాంతంలో ఒకవైపున రెస్టారెంట్ ఉంటుంది.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరణ

శంకర్‌పల్లి: ఓ మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు అపహరించుకుపోయిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ కేంద్రంలోని బీవీఆర్ రోడ్డులో ఎస్. లింగం, పద్మ దంపతులు కిరాణాషాపు నడిపించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి పద్మ కిరాణా షాపులో ఉండగా.. రెండు లేస్ ప్యాకెట్లు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల పుస్తెల తాడును అపహరించుకొని వెళ్లారు. మహిళ కోలుకొనేలోపే దొంగలు బైక్‌పై పరారీ అయ్యారు. ఈ మేరకు శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని పలు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. త్వరలోనే కేసును ఛేదిస్తామని సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు.



హోలీమేరీ ఇంజనీరింగ్ కళాశాల కాలేజీ జట్టు



వీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల జట్టు

హోరాహోరీగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్

SPL SAKSHI PREMIER LEAGUE | SAKSHI సాక్షి SAKSHI DIGITAL MEDIA GROUP

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారం లోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో సాక్షి యాజమాన్యం నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్-4 (ఎస్‌పీఎల్) పోటీలు శుక్రవారం కూడా హోరాహోరీగా జరిగాయి.

విజేతల వివరాలు...

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-1

- మొదటి మ్యాచ్‌లో ఎస్పీ కాలేజ్ 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసి పరాజయం పాలైంది. ఎస్పీ కాలేజ్‌కు చెందిన ఇశాన్ 26 బంతుల్లో 75 పరుగులు, ఎడ్వాన్ 18 బంతుల్లో 39 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించారు.
- రెండవ మ్యాచ్‌లో సీఎంఆర్-ఎ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన లయోలా డిగ్రీ జట్టు 8.2 ఓవర్లలో 89 పరుగులు చేసి విజయం సాధించింది.
- మూడవ మ్యాచ్‌లో వీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసి ఓడిపోయింది.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-2

- మొదటి మ్యాచ్‌లో కేఎల్ హైదర్‌బాద్ జట్టు 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన హోలీమేరీ అటానామస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 75 పరుగులకు ఆలౌట్ అయి ఓడిపోయింది. కేఎల్ జట్టు క్రీడాకారుడు అయాశ్ 25 బంతుల్లో 61 పరుగులు చేయగా, కౌషిక్, షన్ముక్ మూడేసి వికెట్లు తీశారు.
- రెండో మ్యాచ్‌లో హోలీమేరీ-ఎ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 134 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన వేదా డిగ్రీ-బి జట్టు 10 ఓవర్లలో 110 పరుగులు చేసి ఓడింది. హోలీమేరీ జట్టు క్రీడాకారుడు సర్దార్ 19 బంతుల్లో 61 పరుగులు చేశాడు.
- మూడవ మ్యాచ్‌లో అవినాశ్ డిగ్రీ కాలేజ్ జట్టు 9.4 ఓవర్లలో 91 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన భారత్ ఫార్మసీ జట్టు 5 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేసి పరాజయం పాలయింది.

కల్యాణ వైభోగమే..



కడ్తాల్‌లో స్వామివారి కల్యాణోత్సవం



కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, ఎంపీపీ తదితరులు

- కనులపండువగా లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం
- హాజరైన ప్రజాప్రతినిధులు, భక్తులు

కడ్తాల్: మండల కేంద్రంలో లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు బ్యాండు మేళాలతో స్వామివారి తలంబ్రాలు, పట్టువస్త్రాలను ఊరేగించి ఆలయానికి తీసుకువచ్చారు. స్వామి వారికి పట్టు వస్త్రాలను కందికంటి సుధాకర్‌గౌడ్ బహూకరించగా, పుస్తె మెట్టెలను కృష్ణమూర్తి అందజేశారు. వేదపండితులు మేళ్లూరి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలను భక్త జనుల గోవిందనామ స్మరణ మధ్య కనులపండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు. ఆదే విధంగా కల్యాణ మహోత్సవ వేడుకలకు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. భాస్కర్‌రెడ్డి భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, సేవ్యానాయక్, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, ఉప సర్పంచ్ రామకృష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన తప్పనిసరి

షాద్‌నగర్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) మహబూబ్‌నగర్ జిల్లా కో ఆర్డినేటర్ ఉత్తరపల్లి రామాచారి అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలోగల శివహనుమాన్ దేవాలయంలో ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవికి కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం రామాచారి మాట్లాడుతూ ధనంతో సాధించలేని జ్ఞానాన్ని ధ్యానంతో సాధించవచ్చని అన్నారు. సమస్యలు వచ్చాయని సంకోచించకుండా సాధనతో కూడిన ప్రయత్నంచేస్తే పరిష్కార మార్గం లభిస్తుందని అన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు సేవా భావాన్ని అలవర్చుకొని భగవన్నామ స్మరణ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిప్రసాద్‌యాదవ్, ఎంపీటీసీ కావలిశ్రీశైలం, వార్డు సభ్యురాలు విజయలక్ష్మి, టీటీడీ షాద్‌నగర్ కార్యదర్శి నక్కనర్సింలు, లింగమయ్యగౌడ్, వల్లసుదర్శన్‌చారి, సుధాకర్‌చారి, నర్సింహ్మారెడ్డి, చంద్రయ్య, బద్దుల లక్ష్మయ్యయాదవ్, వెంకటేష్‌గౌడ్, నీరటినారాయణ, ఇస్తారి, శంకరయ్య, రమేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వాగులో పడి వృద్ధురాలి మృతి



దాసరితిరుపతమ్మ మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: వాగులో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి శివారులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామానికి చెందిన దాసరి తిరుపతమ్మ(62) శుక్రవారం గ్రామంలో పెన్షన్ తీసుకొని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సర్దార్‌నగర్‌లోని కూతురు వద్దకు బయలు దేరింది. మార్గమధ్యంలో అయ్యవారిపల్లి శివారులోని వాగులో పడి మృతి చెందింది. వృద్ధురాలి మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని దాసరి తిరుపతమ్మగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పట్టణ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి తీవ్రగాయాలు

కందుకూరు: విద్యుదాఘాతంతో పెయింటర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దెబ్బడగూడకు చెందిన మల్లేపల్లి భరత్(21) ఇళ్లకు కలర్ వేసే పనులు చేస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం కొత్తగూడ చౌరస్తా పరిధిలోని రైస్‌మిల్లు ఎదుట ఉన్న కాలనీలో ఓ ఇంటికి రంగులు వేస్తున్నారు. ఆ భవనం సమీపం నుంచే 33 కేవీ విద్యుత్ లైన్ ఉంది. రంగులు వేసే క్రమంలో ఆ లైన్ నుంచి విద్యుదాఘాతంకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

హత్యకేసులో ముద్దాయికి యావజ్జీవ శిక్ష

చేవెళ్ల: ఓ వ్యక్తి హత్యచేసిన కేసులో నిందితునికి శుక్రవారం 9వ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి న్యాయ విచారణ చేసి యావజ్జీవ కారాగార శిక్ష, 12వేల రూపాయల జరిమానా విధించారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చేవెళ్ల మండలం మల్కాపూర్‌కు బతుకుదెరువు నిమిత్తం వికారాబాద్ జిల్లా పరిగి మండలం మాదారం గ్రామానికి చెందిన బోయిని సత్తయ్య వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుండేవాడు. మల్కాపూర్ గ్రామానికి చెందిన ఒగ్గు శివ అనే యువకుడు 2020 ఆగస్టు 29న బోయిని సత్తయ్య వద్ద ఉన్న డబ్బులను కాజేసేందుకు అతనికి మద్యం తాగించి గ్రామ శివారులో బండరాయితో తలపై మోది హత్య చేశాడు. పోలీసులు విచారణ చేసి శివను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు విచారణలో భాగంగా జడ్జి పైవిధంగా తీర్పు వెల్లడించినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం



కాజల్ (ఫైల్)

పహాడీషరీఫ్: ఓ యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రసాద్ సింగ్ కుమార్తెలు కాజల్ (21), శాలినిసింగ్ ఠాకూర్‌లు రెండేళ్ల క్రితం తుక్కుగూడకు వచ్చి నివాసం ఉంటున్నారు. రోజు మాదిరిగానే జనవరి 21న శాలిని రేడియంట్ కంపెనీలో డ్యూటీకి వెళ్లి తిరిగి వచ్చే సరికి...తన సోదరీ కాజల్ కనిపించలేదు. ఫోన్ చేయగా తిరుపతి వెళుతున్నానని.. రెండు మూడు రోజుల అనంతరం వస్తానని చెప్పింది. కానీ ఎంతకూ తిరిగి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం శాలిని పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శంకర్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ ఫిర్యాదులో పేర్కొంది. యువతి ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ 94906 17241 నంబర్‌లో గాని సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

చేవెళ్ల: లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం పొందవచ్చని, ట్రాఫిక్‌కు సంబంధించిన కేసులను పరిష్కరించుకోవాలని రిటైర్డ్ జడ్జి సాంబమూర్తి అన్నారు. ట్రాఫిక్ కేసుల పరిష్కారానికై చేవెళ్లలో 10 రోజులపాటు నిర్వహించే లోక్ అదాలత్ శుక్రవారం రెండో రోజు కొనసాగింది. 126 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండలాలకు చెందిన వాహనదారుల ట్రాఫిక్ కేసులను పరిష్కరించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వాసు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి సాంబమూర్తి

బీజేపీ బలోపేతానికే కమిటీలు

కొందుర్గు: గ్రామాల్లో బీజేపీని బలోపేతానికే కమిటీలు వేస్తున్నామని ఆ పార్టీ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు కుర్మయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పీర్జాపూర్‌లో బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి పేదవాడికి అందుతున్నాయన్నారు. పీర్జాపూర్ బూత్ కమిటీ అధ్యక్షుడిగా శీలం అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, శ్రీరామ్, సంగమేష్, నర్సింలు పాల్గొన్నారు.



బూత్ కమిటీ ఎన్నికల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు